# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 22-03-2026 సమయం : సాయంకాలం 6గం.10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ అధునాతన సాంకేతికతతో అమరావతిని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ ఆర్సెలార్ మిత్తల్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్లాంట్‌కు అనకాపల్లి జిల్లాలో ముఖ్యమంత్రి రేపు శంకుస్థాపన చేయనున్నారు.
- ❖ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు.
- ❖ ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో రేపు, ఎల్లుండి పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

======================

అత్యంత అధునాతన సాంకేతికతతో అమరావతిని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కృత్రిమ మేథ వినియోగం, విస్తరణ లక్ష్యంగా హైదరాబాద్‌లోని ఐఎస్‌బీలో ఈరోజు ఏర్పాటు చేసిన "సౌత్ ఏసియా లెర్నింగ్ సమ్మిట్"లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. అనంతరం సమ్మిట్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా రాష్ట్రంలో పాలన అందిస్తున్నామని తెలిపారు. సోలార్, విండ్, గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నామని, గ్రీన్ ఎనర్జీ రంగంలో దక్షిణాదిలో ఆంధ్రప్రదేశ్ ప్రధమ స్థానంలో ఉందని అన్నారు. రాష్ట్రంలో డేటా సెంటర్లు, క్వాంటమ్, స్పేస్ టెక్నాలజీ, కృత్రిమ మేథకు ప్రాధాన్యత ఇస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

======================

ఆర్సెలార్ మిత్తల్ నిప్పాన్ స్టీల్ ఇండియా సంస్థ నెలకొల్పనున్న గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్‌కు అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు శంకుస్థాపన చేయనున్నారు. దాదాపు 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో లక్షా 35 వేల 964 కోట్ల రూపాయల పెట్టుబడితో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కానుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మొత్తం 5 వేల 465 ఎకరాల్లో 2 దశల్లో ఈ ప్రాజెక్టు సాకారం కానుంది. మొదటి దశలో 7.3 మిలియన్ మెట్రిక్ టన్నులు, రెండో దశలో 10.5 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఉక్కు ఉత్పత్తి కానున్నది. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల మంత్రి హెచ్.డి. కుమారస్వామి, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్, ఆర్సెలార్ మిత్తల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ మిత్తల్, ఏ.ఎం.ఎన్.ఎస్. ఇండియా ఛైర్మన్ ఆదిత్య మిత్తల్ పాల్గొననున్నారు.

======================

దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనకాపల్లి జిల్లాలో రేపు శంకుస్థాపన చేస్తారని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన ఏర్పాట్లను మంత్రి వంగలపూడి అనిత, పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్‌తో కలసి కొల్లు రవీంద్ర ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉక్కు కర్మాగారం రాకతో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని తెలిపారు. స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కొల్లు రవీంద్ర పేర్కొంటూ...

(వాయిస్ 22 సెకన్లు)

విరామం

======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 132వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 27వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

======================

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రానున్న జూన్ నెలలో విమాన సర్వీసులు ప్రారంభం అవుతాయని విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు వెల్లడించారు. అమరావతిలో ఆయన ఈరోజు మాట్లాడుతూ... 20 నెలల్లో ఉత్తరాంధ్ర అభివృద్ధిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసి చూపించారని తెలిపారు. ఉత్తరాంధ్రలో అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోందని పేర్కొన్నారు. ఆర్సెలార్ మిత్తల్ స్టీల్ ప్లాంట్ ఉత్తరాంధ్రకు మరో మణిహారంగా నిలుస్తుందన్నారు. 2029 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి కానుందన్నారు. గత ప్రభుత్వం ఉత్తరాంధ్రను నిర్లక్ష్యం చేసిందని, కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని తెలిపారు. ఉత్తరాంధ్ర అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నారు.

======================

రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని దేవదాయ, ధర్మదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 27 కోట్ల రూపాయల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు నెల్లూరు లోక్ సభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో కలిసి ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ... రైతుల సమస్యలపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తోందన్నారు. ప్రధానంగా రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు విస్తృతంగా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోగా వారి ఖాతాల్లోకి నగదును జమ చేస్తున్నామన్నారు.

======================

దక్షిణ అంతర్గత కర్ణాటక పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం, దక్షిణ మధ్య మహారాష్ట్ర, తమిళనాడు, అంతర్గత కర్ణాటక మీదుగా ద్రోణి కొనసాగుతున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్, యానాంపై దిగువ ట్రోపో ఆవరణంలో ఆగ్నేయ / నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు పేర్కొన్నారు. వీటి ఫలితంగా రాష్ట్రంలో రేపు, ఎల్లుండి వర్షాలు కురిసే అవకాశం వుందని ఆయన వెల్లడిస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

======================

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని రేపు జిల్లా కలెక్టరేట్ లో నిర్వహిస్తామని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో నిర్వహిస్తామని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో నమోదైన అర్జీల స్థితి, దానికి సంబంధించిన సమాచారం కొరకు 1100 ఫోన్ నంబర్ ను సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు.

======================
======================